క్లుప్తంగా

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

సి.బెళగల్: మండల పరిధిలోని కృష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోనా వేంకటేశ్వర స్వామివారికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. భూదేవి, అలివేలిమంగమ్మ సమేత కోనా వేంకటేశ్వరస్వామి మూల విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా కాశిరెడ్డి నాయన 29వ ఆరాధనోత్సవం


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గడివేముల: మండలంలోని దుర్వేశి బాట సమీపంలో వెలసిన బృందావన పుణ్యక్షేత్రం సద్గురు కాశిరెడ్డి నాయన ఆలయంలో 29వ ఆరాధనోత్సవం శనవారం ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు దుర్వేశి గ్రామానికి చెందిన ద్వారం రామసుబ్బారెడ్డి, హైమావతమ్మ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి దుర్వేశి గ్రామం నుంచి జ్యోతులను తీసుకురానున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదాలు నిర్వహించారు.

వన్ మెన్ కమిషన్‌ను రద్దు చేయండి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాల విద్యార్థి సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): షెడ్యూల్డ్ కులాల వర్గీకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో నియమించిన వన్‌మెన్ కమిషన్‌ను రద్దు చేయాలని మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాసారపు వెంకటేష్ కోరారు. శనివారం స్థానిక అంబేడ్కర్ భవన్ ముందున్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి చలో గుంటూరు కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును, భారత రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ ఆర్టికల్ 341ని నిర్వీర్యం చేయడమే అన్నారు. ఈనెల 15న గుంటూరులో మాలల మహా గర్జనకు మాలలు తరలిరావాలన్నారు.కార్యక్రమంలో స్వామిదాస్, నాగేంద్ర, నారాయణ, పసల నాగేంద్ర, రాజీవ్‌కుమార్, కే రాజు పాల్గొన్నారు.

176 కేసులు పరిష్కారం

కర్నూలు (టౌన్): జాతీయ లోక్ అదాలత్‌లో నగరపాలక రెవెన్యూ విభాగానికి సంబంధించి 176 కేసులు పరిష్కారమయ్యాయి. వివిధ పన్నులకు సంబంధించి వాణిజ్య దుకాణాలకు నగరపాలక అధికారులు గత నవంబర్ 20 నుంచి ఈనెల 14 వరకు మొత్తం 1,459 నోటీసులు జారీ చేశారు. నోటీసులకు స్పందించిన వారు శనివారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో పరిష్కారం చేసుకున్నట్లు రెవెన్యూ ఆఫీసర్లు ఇశ్రాయేలు, జునీద్ తెలిపారు.

డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించాలి


మురుగు కాల్వను పరిశీలిస్తున్న కమిషనర్

కల్లూరు: అధికారులు డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించాలని, సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని కమిషనర్ రవీంద్రబాబు సూచించారు. శనివారం కల్లూరు అర్బన్ పరిధిలోని ఉల్చాల రహదారిలోని నాగేంద్రనగర్, సిద్దార్థ, అపూర్వ హోమ్స్, వై.జంక్షన్ తదితర ప్రాంతాల్లో అధికారులతో కలసి కమిషనర్ పర్యటించారు. ఆయా కాలనీల ప్రజలతో కమిషనర్ మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. డ్రైనేజీలో సమస్యలు ఏర్పడకుండా పారిశుద్ధ్య విభాగపు అధికారులు, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కాలనీలో అత్యవసర పనులు ప్రాధాన్యత ఇస్తూ, జాప్యం లేకుండా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్యధికారి డాక్టర్ కె. విశ్వేశ్వర్‌రెడ్డి, డీఈఈ కృష్ణలత, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అంజాద్ బాషా, ఏఈ భాను ప్రతాప్ పాల్గొన్నారు.

రైతు బజారుకు మోక్షమెప్పుడో?

- ప్రారంభానికి నోచుకోని గోవర్ధన్ నగర్ రైతుబజారు
- మాజీ ఎమ్మెల్యే కాటసాని చొరవతో గతంలో ఏర్పాటు
- రూ.50 లక్షలతో మార్చిలో నిర్మాణం పూర్తి
- ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిన ప్రారంభోత్సవం
- కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటినా అతీగతీలేని వైనం
- వినియోగంలోకి తీసుకురావడంలో మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు

రైతులు పండించిన కూరగాయలను గిట్టుబాటు ధరకు అమ్ముకోవడం, వినియోగదారులకు తాజా కూరగాయలు అందుబాటులో ఉంచడం లక్ష్యంగా గత ప్రభుత్వం కల్లూరు గోవర్ధన్ నగర్‌లో రైతుబజారును నిర్మించింది. గత మార్చిలోనే నిర్మాణం పూర్తయినా అప్పట్లో ఎన్నికల కోడ్ కారణంగా ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. తర్వాత అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం రైతుబజారును ప్రారంభించకుండా జాప్యం చేస్తోంది. రైతుబజారులో రైతులు గాకుండా తాము చెప్పిన వారే కూరగాయలు అమ్ముకునే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. అందుకే ప్రారంభోత్సవంలో జాప్యం అవుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


గోవర్ధన్ నగర్‌లో నిర్మించిన రైతుబజారు

కర్నూలు(అగ్రికల్చర్)/కల్లూరు: నగర ప్రజల అవసరాలకు తగిన విధంగా కల్లూరు అర్బన్ గోవర్ధన్ నగర్‌లోని రైతుబజారు నిర్మాణం చేపట్టి నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. రైతుబజారు ప్రారంభం కోసం ఇటు రైతులు, అటు వినియోగదారులు ఎదురు చూస్తున్నారు. రైతుబజారును ప్రారంభించేందుకు మార్కెటింగ్ శాఖ తగిన చొరవ తీసుకోకపోవడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. 2017లో అప్పటి ప్రభుత్వం రైతుబజారు నిర్మాణానికి చర్యలు తీసుకుంది. అయితే ఒక్క రూపాయి కూడా విడల్చలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రైతుబజారు నిర్మాణానికి మార్గం సుగమం అయింది. అప్పటి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తీసుకున్న చొరవ వల్ల ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నిధులు విడుదల కావడంతో ఈ ఏడాది మార్చిలో పనులు పూర్తయ్యాయి. రైతుబజారును ప్రారంభించి ఇటు రైతులకు, అటు వినియోగదారులకు అందుబాటులోకి తీసుకరావాల్సిన మార్కెటింగ్ శాఖ ప్రస్తుతం మీనమేషాలు లెక్కిస్తోంది. రైతుబజారులో కూరగాయలు అమ్ముకునేందుకు అర్హులైన రైతులను కూడా గుర్తించారు. కానీ రైతుబజార్‌ను ప్రారంభించడంలో జాప్యం జరుగుతుండటం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది.

అంతా మా వాళ్లే ఉండాలి

గోవర్ధన్ నగర్‌లో నిర్మించిన రైతుబజారును ప్రారంభించేందుకు మార్కెటింగ్ శాఖ అధికారులు పలుమార్లు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితను సంప్రదించారు. కొత్త రైతుబజారులో కూరగాయలు అమ్ముకునేందుకు అర్హులైన రైతులను గుర్తించి వారికి గుర్తింపు కార్డుల తయారీలో సంబంధిత అధికారులు నిమగ్నమయ్యారు. ఎంపిక చేసిన రైతుల వివరాలను కూడా ఎమ్మెల్యేకు అందజేశారు. ఎంపిక చేసిన రైతుల పట్ల ఎమ్మెల్యే గౌరు చరిత అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. రైతుబజారులో అంతా తమ వాళ్లే ఉండాలనే విధంగా టీడీపీ నేతల తీరు ఉంది. ఇందువల్లే రైతుబజారును ప్రారంభించడంలో జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది.

రూ.50 లక్షల వ్యయంతో నిర్మాణం

గతంలో పాణ్యం ఎమ్మెల్యేగా ఉన్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి తీసుకున్న చొరవ వల్ల నాటి ప్రభుత్వం రైతుబజారు నిర్మాణానికి రూ.50 లక్షలు విడుదల చేసింది. మార్కెటింగ్ శాఖ ఇంజినీరింగ్ విభాగం నిర్మాణ పనులు చేపట్టింది. గోవర్ధన్ నగర్‌లో రైతుబజారు నిర్మించడం వల్ల కల్లూరు మండలంలోని చిన్నటేకూరు, పెద్దటేకూరు, దొడ్డిపాడు, బస్తిపాడు, లక్ష్మీపురం, బొల్లవరం, పందిపాడు, కోడుమూరు మండలం అనుగొండ తదితర గ్రామాలకు చెందిన రైతులు పండించిన కూరగాయలను అమ్ముకునే అవకాశం ఏర్పడింది. రైతుబజారులో 34 స్టాళ్లు ఉన్నాయి. మూడు షాపులు, ఎస్టేటు ఆఫీసర్ ఆఫీసు నిర్మించారు. కర్నూలు నగరంలోని సీ.క్యాంపు రైతుబజారు దూరంగా ఉండే ప్రాంతాలతో పాటు గోవర్ధన్ నగర్, ముజఫర్‌నగర్, పందిపాడు, పోలీసు కాలనీ, శరీన్‌నగర్, కల్లూరు ఎస్టేట్, బళ్లారి చౌరస్తా తదితర ప్రాంతాల వినియోగదారులకు తాజా కూరగాయలు, ఆకుకూరలు అందుబాటులో ఉండే అవకాశం ఏర్పడింది. నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ ప్రారంభానికి నోచుకోకపోవడం పట్ల వినియోగదారులు, రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మార్చి నెలలోనే రైతుబజారును ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ ఎన్నికల కోడ్ వల్ల ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటిననా ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడం పట్ల రైతులు, ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త రైతుబజారుతో ప్రజలకు ఉపయోగం



గోవర్ధన్‌నగర్‌లో రైతుబజారు ఏర్పాటు చేయడం వల్ల అన్ని రకాల తాజా కూరగాయలు, ఆకుకూరలు అందుబాటులో ఉంటాయి. ముజఫర్‌నగర్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి సీ.క్యాంప్ రైతుబజార్ దూరంగా ఉండడం వల్ల అక్కడకి వెళ్లాలంటే సమయం ఎక్కువ అవుతుంది. కిరాణం దుకాణాల వద్ద నాణ్యత లేని కూరగాయల రేట్లు అధికంగా ఉంటున్నాయి. రైతుబజారుకు పోవాలంటే తీవ్ర వ్యయ ప్రయాసలకు గురికావాల్సి వస్తోంది. అధికారులు చొరవ తీసుకొని రైతుబజారు సత్వరమే ప్రారంభించి వినియోగదారులకు తాజా కూరగాయలు అందించే ఏర్పాటు చేయాలి.

– ఖాజా, ముజఫర్‌నగర్, కల్లూరు అర్బన్

నేడు ఉచిత పౌరాణిక నాటకాల ప్రదర్శన

కర్నూలు కల్చరల్: కళావాహిని సాంస్కృతిక సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఉచిత పౌరాణిక నాటకాల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు సంస్థ అధ్యక్షులు మనోహర్ బాబు తెలిపారు. భవాని చింతామణి సీను, సత్య హరిశ్చంద్ర వారణాసి సీను ప్రదర్శన ఉంటుందన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ లైన్ల అభివృద్ధి పనుల నిమిత్తం ఆదివారం సీ.క్యాంపు సెక్షన్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఈఈ శేషాద్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విజ్ఞాన మందిర్ సర్కిల్, పోస్టాఫీస్ సర్కిల్, అరోరా నగర్, బీ క్యాంపు క్వార్టర్స్, బీ క్యాంపు హౌసింగ్ బోర్డ్ కాలనీ, జేసీ బంగ్లా పరిసర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపి వేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

17న ఫిట్ ఇండియా సైక్లింగ్

కర్నూలు (టౌన్): ఈనెల 17న ఫిట్ ఇండియా సైక్లింగ్ నిర్వహించనున్నట్లు సాయి (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) కర్నూలు సెంటర్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు ఔట్‌డోర్ స్టేడియం నుంచి ప్రారంభమయ్యే సైక్లింగ్ కార్యక్రమం పాత ఎస్పీ బంగ్లా మీదుగా ఆర్ఎస్ రోడ్డు, జ్యోతి మాల్, పాత కంట్రోల్ రూమ్, ఇండోర్ స్టేడియం, వైస్సార్ సర్కిల్ మీదుగా తిరిగి ఔట్‌డోర్ స్టేడియం చేరుకుంటుందన్నారు. కాలుష్య నివారణలో భాగంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.


మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలి

కర్నూలు (టౌన్): బాలికల్లో ఆత్మరక్షణతోపాటు ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ సూచించారు. శనివారం స్థానిక కింగ్ మార్కెట్ వద్ద ఉన్న మున్సిపల్ ఉన్నత పాఠశాల పార్క్‌లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు ఆయన షీల్డ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరాటే శిక్షకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా అయ్యప్ప దీపోత్సవం

- అయ్యప్ప విళక్కులో మారుమోగిన అయ్యప్ప నామస్మరణం


పడి పూజను వీక్షిస్తున్న భక్తులు


పడి పజలో అయ్యప్ప భక్తులు

కర్నూలు కల్చరల్: అయ్యప్ప స్వామి దీపోత్సవ వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. అయ్యప్ప దీప మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ హై స్కూల్ మైదానంలో 47వ దీపోత్సవ వేడుకను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కేరళకు చెందిన సుమారు 40 మంది స్వాములు ఇక్కడికి వచ్చి అరటి బోదెలతో అయ్యప్ప స్వామి, కరుత్తు, కరుప్పు, వావర్ స్వామి, మాలికా పురోత్తమ్మ ఆలయాల నమూనాలు ఏర్పాటు చేసి పూజలు చేశారు. మహా గణపతి హోమం, అయ్యప్ప పునః ప్రతిష్ట, ఉష పూజ, దీపారాధన, చెండా మేళం, లలితా సహస్ర నామ కుంకుమార్చన, లక్ష శరణుగోష అర్చన, ఉచ్ఛ పూజ, పడి పూజ నిర్వహించారు. చెండ, సింగారి మేళ తాళాలతో పూజా, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు, దీపోత్స ఊరేగింపు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. ఆదివారం అయ్యప్పన్ విళక్కు, అయ్యప్ప జనన స్తోత్రాలతో జ్యోతులు వెలిగించుట, అయ్యప్ప వావర్ స్వాముల కాగడ హారతి, అయ్యప్ప స్వామి వావర్ స్వాముల యుద్ధం, అగ్ని ప్రవేశం కార్యక్రమాలు తెల్లవారుజాము వరకు జరిగాయి. చంద్రశేఖర్‌రెడ్డి గురుస్వామి మిత్ర బృందంచే భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. దీపోత్సవ కమిటీ సభ్యులు, గురుస్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి


క్రీడా సామగ్రిని అందజేస్తున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆయుష్మాన్ నర్సింగ్ కాలేజీ డైరెక్టర్ చంద్రమౌళి సూచించారు. శనివారం కర్నూలులోని ఆయుష్మాన్ నర్సింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన నందికొట్కూరు మండలం వడ్డెమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయులు డి.ఈశ్వరయ్య, ఫిజికల్ డైరెక్టర్ రాజేశ్వరిదేవి, విద్యాకమిటీ చైర్మన్ అహ్మద్ హుసేన్‌లకు రూ.9 వేల విలువైన క్యారమ్ బోర్డు, సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో రిజర్వేషన్ సదుపాయం ఉందని, అందువల్ల విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. తన గురువైన గణిత ఉపాధ్యాయులు ఈశ్వరయ్య కోరిక మేరకు విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేస్తున్నట్లు తెలిపారు.

గడ్డివాములు దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఓర్వకల్లు : మండలంలోని నన్నూరులో శనివారం అగ్ని ప్రమాదంలో రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది, స్థానికుల వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కురువ లద్దగిరి కృష్ణయ్య కుమారుడు లద్దగిరి రవికుమార్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అదేవిధంగా 32 ఆవులు, 2 ఎద్దులు, 8 దూడ పిల్లలను పోషిస్తున్నాడు. ఈ మేరకు రూ.2.60 లక్షలు వెచ్చించి వరిగడ్డి, చొప్ప, శనగ, కంది పొట్టు కొనుగోలు చేసి కల్లంలో రెండు భారీ గడ్డివాములు వేశాడు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో రెండు గడ్డివాములు దగ్ధమవుతుండగా గుర్తించిన ఓ వృద్ధురాలు బాధిత రైతు కుటుంబ సభ్యులకు చెప్పింది. స్థానికులు మంటలార్పేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. సమాచారం మేరకు వచ్చిన కర్నూలు అగ్నిమాపక పోలీసులు మంటలను అదుపు చేశారు. అధికారులు విచారించి న్యాయం చేయాలని గ్రామస్తులతోపాటు బాధిత రైతు రవికుమార్ కోరారు.

ఆటోను ఢీకొన్న ఆర్‌టీసీ బస్సు


మహిళను పరామర్శిస్తున్న ఎద్దుల మహేశ్వరరెడ్డి



చికిత్స పొందుతున్న ఉపేంద్ర

కోడుమూరు రూరల్ : మండల కేంద్రం కోడుమూరులో శనివారం ఉదయం ఆటోను ఆర్‌టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. కోడుమూరులోని బుడగజంగాల కాలనీకి చెందిన బుడబుక్కల వేదవతి తన కుమారుడు ఉపేంద్రతో కలిసి చిరు వ్యాపారం నిమిత్తం ఆటోలో ఉదయాన్నే బయలుదేరారు. ఇదే సమయంలో కర్నూలు నుంచి కోడుమూరు మీదుగా వెళ్తున్న ఆర్‌టీసీ బస్సు ఆటోను ఢీకొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న తల్లికుమారుడికి తీవ్రగాయాలవ్వడంతో స్థానికులు కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి ఆసుపత్రి చేరుకుని వారిని పరామర్శించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని రోడ్డుకడ్డంగా ఉన్న ఆర్‌టీసీ బస్సు, ఆటోను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సాగునీటి ఎన్నికల్లో అధికారులు అత్యుత్సాహం!

- టీసీల నామినేషన్ స్వీకరించని ఎన్నికల అధికారి
- ఉదయం10.20గంటలకు సమయం అయిపోయిందటూ బుకాయింపు
- 11గంటలకు టీడీపీ నామినేషన్లు స్వీకరణ
- టీసీల నామినేషన్‌ల పన్నులు చెల్లింపు జాప్యం
- మండిపడుతున్న టీసీ అభ్యర్థులు


నామినేషన్ పత్రాలతో టీసీ అభ్యర్థులు


NO DUE CERTIFICATE

Authorised Officer & Election Officer

Tahsildar

Panyam Mandal

తహసీల్దార్ షీల్ లేకుండానే నో డ్యూ సర్టిఫికెట్ జారీ చేసిన దృశ్యం

పాణ్యం: సాగునీటి సంఘాల ఎన్నికల్లో అధికారులు అత్యుత్సాహం చూపారు. అధికార పార్టీ మద్దతుదారులకే పదువుల కట్టబెట్టేందుకు అధికారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. వైఎస్సార్‌సీపీ ఎన్నికలను బహించగా అక్కడక్కడ స్వతంత్రులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులను కుంటిసాకులతో అధికారులు ముప్పుతిప్పలు పెట్టారు. చివరికి నామినేషన్ పత్రాలు తీసుకుకోకుండా వెనుక్కు పంపారు. వన్‌సైడ్‌గా అధికారులు అధికారపార్టీకి పట్టం కట్టించి మొప్పుపొందిన సంఘటన పాణ్యం మండలం వడ్డుగండ్ల గ్రామంలో చోటు చేసుకుంది. వడ్డుగండ్ల చెరువు కింద 160మంది పురుషులు, 47మంది స్త్రీలు ఓటర్లు ఉన్నారు. ఈ చెరువు ఒక డబ్ల్యూయూఏ, ఆరుమంది టీసీలు ఎన్నిక కావాల్సింది. ఎన్నికల అధికారిగా ఎఈఓ కోటయ్య వ్యవహరించారు. అయితే టీసీలుగా పోటీ చేసేందుకు ఆయకట్టు పరిధిలోని వెలుగు పద్మావతి, పోంకం వెంకటేశ్వర్లు, బోయ కేశాలు, పర్వతం బాలశౌరెడ్డి, దెరెడ్డి నాగేశ్వరరెడ్డి అన్ని దరఖాస్తులను పూర్తి చేసి పాఠశాల వద్ద ఎన్నికల అధికారి కోటయ్యకు ఇచ్చేందుకు 10.20 గంటలకు లోపలికి వెళ్లారు. అయితే కోటయ్య సమయం లేదంటూ బుకాయించారు. మీరు రాజీ అవుతారు కదా ఎన్నిక ఎందుకంటూ ఫోన్‌లో ఇతరులతో యవ్వారం చేశారు. పది నిమిషాల పాటు సమయం వృథా అయ్యాకా సమయం అయిపోదంటూ బుకాయించారని అభ్యర్థులు వాపోయారు. మేము ముందుగానే వచ్చాం కాదా అని చెప్పినా పట్టించుకోని ఎన్నికల అధికారి పోలీసులతో బయటకు పంపించారన్నారు. తాము అక్కడే బయట ఉండగా టీడీపీ మద్దతుదారులు 11గంటలకు లోపలికి వెళ్లి నామినేషన్లు వేశారన్నారని రైతులు వాపోయారు. అధికారి టీడీపీకి ఊగిగం చేస్తున్నారని వారు మండిపడ్డారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ ఆశ్రయించి కోర్టుకు వెళ్తామని రైతులు చెప్పారు. ఎన్నికలను వైఎస్సార్‌సీపీ బహిష్కరించగా చాలాచోట్లా అధికార పార్టీ నాయకుల మధ్య పోటీ ఏర్పడింది. ఎమ్మెల్యే, ఎంపీ వర్గాల మధ్య పోటీ ఉందని భావించిన పోలీసులు బందోబస్త్ చేపట్టారు. ఎన్నికల సరళిని నంద్యాల డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. మండలంలో మొత్తం 15నీటి సంఘాలకు ఎన్నికలు జరిగాయి.

నో డ్యూ సర్టిఫికేట్ జారీలోనూ వింతలు

అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో నోడ్యూ సర్టిఫికెట్ జారీలోనూ వింతలు చోటు చేసుకున్నాయి. వడ్డుగండ్ల చెరువు ప్రెసిడెంట్, టీసీలు పోటీ చేయాలనే ఉద్దేశంతో 13వ తేదీన పన్ను చెల్లించామని, అయితే నో డ్యూ సర్టిఫికేట్‌కు సంబధించి దరఖాస్తు ఫారాలు వీఆర్‌ఓ శివశంకర్ తానే తహసీల్దార్‌కు పంపి మీకు ఇస్తామని మోసం చేశారని రైతులు వాపోయారు. పోలింగ్ రోజు వీఆర్‌ఓ దగ్గరనే పెట్టుకుని బలపనూరులో ఉండగా టీసీ అభ్యర్థులు వీఆర్‌ఓ వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సి వచ్చింది. అయితే నో డ్యూ సర్టిఫికెట్లలో సంతకం చేసిన తహసీల్దార్ షీల్ వేయకుండా ఇవ్వడంపై అభ్యర్థులు తీవ్రంగా మండిపడుతున్నారు. విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగానే స్పందించారు. వడ్డుగండ్లలో టీసీలకు పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్లు తీసుకునేందుకు నిర్ణీత సమయంలోపు కేంద్రం వద్దకు వెళ్లి ఉండాలి. వడ్డుగండ్లలో అభ్యర్థుల నామినేషన్‌లు తీసుకోలేదనే విషయం నాకు తెలిసింది. వీటిపై క్షేత్ర స్థాయిలో విచారిస్తాం.

తమ్ముళ్ల విభేదాలు బహిర్గతం


కోట్ల వర్గీయుడు జూలకల్ సుధాకర్‌ను లాక్కెళ్తున్న పోలీసులు

సి.బెళగల్: సి.బెళగల్ మండలంలో శనివారం జరిగిన నీటి సంఘం ఎన్నికలలో కూటమి నేతల మధ్య కుమ్ములాట చోటు చేసుకుంది. తెలుగు తమ్ముళ్ల మధ్య విభేదాలు మరోమారు బహిర్గతమయ్యాయి. సి.బెళగల్ మండల వ్యాప్తంగా నాలుగు నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయి. బ్రాహ్మణదొడ్డి గ్రామ నీటి వినియోగదారుల సంఘం 47 (డబ్ల్యూయూఏ)కు 12 ప్రాదేశిక నియోజకవర్గాలు(టీసీ) ఉన్నాయి. బ్రాహ్మణదొడ్డితోపాటు గూడూరు మండలానికి చెందిన జూలకల్లు, పొన్నకల్లు, గూడూరు పట్టణ రైతులు ఆయకట్టు రైతులుగా ఉన్నారు. ఈ మేరకు మాజీ కేంద్ర మంత్రి, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి వర్గీయుడు, గూడూరు మండల టీడీపీ కన్వీనర్ జూలకల్ సుధాకర్ రెడ్డి తనమద్దతు రైతులతో ఒక్కొక్క టీసీకు 5 మంది చొప్పున గూడూరు మండల పరిధి గ్రామాల్లోకి వచ్చే 1, 2, 3, 4, 5, 6 టీసీలకు అభ్యర్థులను, ప్రతిపాధికులను, సాక్షులను సైతం ఏర్పాటు చేసుకుని ఎన్నికల కేంద్రం అయిన బ్రాహ్మణదొడ్డి గ్రామ సచివాలయం చేరుకున్నారు. కొన్ని టీసీలకు జూలకల్ సుధాకర్ రెడ్డితోపాటు కోట్ల సూర్య వర్గం సభ్యులు నామినేషన్ దాఖలు చేశారు. అయితే అప్పటికే ఎన్నికల కేంద్రం దగ్గర ఉన్న కోడుమూరు టీడీపీ నేత ఎదురూరు విష్ణు వర్ధన్‌రెడ్డి వర్గీయులు... కోట్ల వర్గీయులను అడ్డుకున్నారు. తనతోపాటు బాబు, కాంతరెడ్డి తదితరుల నామినేషన్‌లను విష్ణు వర్గీయులు చించేశారని సుధాకర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఎన్నిల కేంద్రంలో నుంచి తమను ఎస్ఐ తిమ్మారెడ్డి బలవంతంగా లాక్కెళ్లారని, సి.బెళగల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాడని సుధాకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. బ్రాహ్మణదొడ్డిలో ఎన్నికలు పూర్తయ్యాకా మధ్యాహ్నం సుధాకర్‌రెడ్డిని సొంత పూచికతూపై సి.బెళగల్ పోలీస్‌లు వదిలిపెట్టారు. టీడీపీకి చెందిన తమపైనే విష్ణువర్ధన్‌రెడ్డి ఈ విధంగా రౌడీయిజం చేయించడం సమంజసం కాదని సుధాకర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

సాగునీటి సంఘాలపై కూటమిదే పెత్తనం

కోడుమూరు రూరల్ : సాగునీటి సంఘాలపై పెత్తనమంతా కూటమి ప్రభుత్వం బలపరిచిన నేతలదే అయింది. సాగునీటి సంఘాల ఎన్నికల్లో అధికారాన్ని అడ్డం పెట్టుకుని కూటమి నేతలు చేస్తున్న అరాచకాలను చూడలేక వైఎస్సార్‌సీపీ మద్దతు దారులు స్వచ్ఛందంగా పోటీ నుంచి తప్పుకున్నారు. అన్ని చోట్ల కూటమి మద్దతుదారులే ఏకగ్రీవంగా గెలుపొందారు.

గూడూరులో...

గూడూరు మండలంలో సాగునీటి సంఘాలకు శనివారం జరిగిన ఎన్నికల్లో ఆయా సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ఏక్రగీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు దూరంగా ఉండడంతో కూటమి బలపరిచిన అభ్యర్థులు గెలుపొందారు. గూడూరు మండలంలో 5 సాగునీటి సంఘాలున్నాయి.

కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి


మాట్లాడుతున్న మనోహర్ మాణిక్యం

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ సర్వజన వైద్యశాల, మెడికల్ కాలేజీలు, పీహెచ్‌సీల్లో ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, ఆరోగ్యశ్రీ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కనీసం వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.మునెప్ప, రాష్ట్ర గౌరవాధ్యక్షులు మనోహర్ మాణిక్యం డిమాండ్ చేశారు. ఏపీ మెడికల్ కాంట్రాక్టు అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ శనివారం కర్నూలు మెడికల్ కాలేజీలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒప్పంద కార్మికులకు రూ.26 వేల కనీసం వేతనం అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. కార్మికుల సమస్యలను మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ నగర ఉప ప్రధాన కార్యదర్శి టి.రామాంజనేయులు, ఉపాధ్యక్షులు పి.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.